న్యాయం జరుగుతుందనే ఆశ

కార్మికుల మొక్కవోని దీక్ష..

కార్మికులు లేకపోతే పరిశ్రమల మనుగడ సాగదు. కార్మికులు లేకపోతే పరిశ్రమలో యంత్రాలు నడవవు.. కార్మికులు లేనిదే ఉత్పత్తులు జరగవు.. అలాంటి కార్మికుల కడుపులు కాలినా పట్టించుకునే యాజమాన్యం, నాయకుడు లేకపాయె.. కార్మికుల శ్రమతో కోట్లు గడించిన యాజమాన్యం పట్టించుకోకపాయె.. మే డే సందర్భంగా జీడిమెట్లలోని సూపర్‌మ్యాక్స్ పరిశ్రమ ఉద్యోగులపై 'సాక్షి'ప్రత్యేక కథనం. కార్మిక దినోత్సవం సందర్భంగానైనా ఆ కార్మికులకు న్యాయం జరగాలని ఆశిద్దాం.


పరిశ్రమ వద్ద రిలే నిరాహార దీక్షలో కార్మికులు

- సూపర్‌మ్యాక్స్ పరిశ్రమ యాజమాన్యం నిర్ణయంతో రోడ్డున పడ్డ కార్మికులు
- 10నెలలుగా జీతాలు, గ్రాంట్స్ రాని వైనం
- కుటుంబ పోషణ భారంగా మారిందని ఆవేదన
- రెండు నెలలుగా కొనసాగుతున్న కార్మికుల నిరాహార దీక్ష

జీడిమెట్ల: సూపర్‌మ్యాక్స్ పరిశ్రమలో ఉద్యోగి అంటేనే మంచి జీతం, భరోసా కలిగిన ఉద్యోగం అనే పేరు 2018 వరకు ఉండేది. అలాంటి పరిశ్రమ ఇప్పుడు యాజమాన్యం స్వార్థ ఆలోచనతో సుమారు 1000మంది కార్మికుల బతుకులను రోడ్డుపైన పడేసింది. కార్మికులకు జీతాలు చెల్లించక పరిశ్రమను నడపక ఉద్యోగుల జీవితాలతో ఆటలాడుతోంది. కాలిన కడుపుతో ఏమి చేయాలో తోచక 60రోజులుగా కార్మికులంతా పరిశ్రమ ఎదుట మొక్కవోని ధైర్యంతో తమకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదంటూ ప్రతిరోజు నిరాహార దీక్ష చేస్తున్నారు.

అసలు సూపర్‌మ్యాక్స్ పరిశ్రమకు ఏమైంది..?

సూపర్‌మ్యాక్స్ పరిశ్రమ యజమాని రాకేష్ మల్హోత్రకు ముంబయిలో 2, హిమాచల్‌ప్రదేశ్‌లో 1, హైదరాబాద్ జీడిమెటలలో 1, బంగ్లాదేశ్‌లో 1 చొప్పున 5పరిశ్రమలు ఉన్నాయి. కాగా 2013సంవత్సరంలో సదరు పరిశ్రమ 30శాతం వాటాను లండన్ కంపెనీకి విక్రయించింది. 2015సంవత్సరంలో మల్హోత్ర, లండన్ పెట్టుబడిదారుడికి మధ్య తగాదాలు జరిగాయి. గొడవ కాస్తా కోర్టు వరకు వెళ్లింది. 2018లో మల్హోత్ర హిమాచల్‌ప్రదేశ్‌లోని ప్లాంటును స్వాధీనం చేసుకుని అక్కడ తక్కువ ఖర్చుతో ఉత్పత్తులను తయారు చేయడం ప్రారంభించింది.

◆ ఇక హైదరాబాద్‌లో ఉత్పత్తులు ఖర్చుతో కూడుకున్నవి కావడంతో హైదరాబాద్ పరిశ్రమలో క్రమక్రమంగా ఉత్పత్తులను తగ్గించింది. 2018 నుంచి పరిశ్రమ నష్టాల్లోకి జారుకున్నట్లు సాకు చూపగా కరోనాతో పరిశ్రమ మరింతా నష్టాల్లోకి వెళ్లింది.

◆ 2022 జూలై నుంచి పరిశ్రమ యాజమాన్యం కార్మికులకు జీతాలు చెల్లించలేదు. డిసెంబర్ నెలలో పరిశ్రమకు విద్యుత్ సరఫరా సైతం నిలిచిపోయింది. దీంతో 10నెలలుగా కార్మికులకు జీతాలు, గ్రాంట్స్ చెల్లించపోవడంతో కార్మికుల కుటుంబాలు రోడ్డున పడ్డాయి.

రూ.30కోట్ల చెల్లించాలని ఆదేశించినా జరగని న్యాయం

ఈ విషయమై కార్మికులు కార్మికశాఖ మంత్రి మల్లారెడ్డితో పాటు ప్రిన్సిపల్ సెక్రటరీ ఆఫ్ ఇండస్ట్రీస్ జయేష్ రంజన్‌ను కలిసి కోర్టులో కేసు వేశారు. అప్పట్లో కోర్టు 331సి సెక్షన్ ప్రకారం రూ.30కోట్ల బకాయిలు చెల్లించాలని జేసీఎల్ చతుర్వేది ఆర్డర్ పాస్ చేశారు. అయినప్పటికీ కార్మికులకు న్యాయం జరగలేదు.

కార్మికులకు నష్టపరిహారం చెల్లించాలి

ప్రస్తుతం కార్మికులకు 9నెలల జీతాలతో పాటు ఉద్యోగం పోయిన కార్మికులకు నష్టపరిహారం చెల్లించాలని ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుతం కార్మికులు ఇళ్ల అద్దెలు చెల్లించలేక, పిల్లలను చదివించలేక, కరెంటు బిల్లులు కట్టలేక, కుటుంబాలు పోషించుకోకుండా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు.

పోరాటం విరమించుకోం..



పరిశ్రమ యాజమాన్యం స్వార్థపూరిత ఆలోచనతో కార్మికులను రోడ్డుపైన పడేసింది. జీతాలు చెల్లించకుండా మా బతుకులతో ఆటలాడుకోవడం మంచి పద్ధతి కాదు. మాకు న్యాయం జరిగే వరకు పోరాటాన్ని ఎట్టి పరిస్థితుల్లో విరమించుకోం.

– ఐ.శ్రీనివాసరావు, బీఎంఎస్ జనరల్ సెక్రటరీ

ప్రభుత్వం పట్టించుకోవాలి..



ప్రస్తుతం ఒక్కో కార్మికుడి పరిస్థితి ఒక్కోలా ఉంది. కొంత మంది అనారోగ్యం బారిన పడగా మరికొంత మంది ఇంటి అద్దెలు కట్టలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పట్టించుకుని తమకు న్యాయం జరిగేలా చూడాలి.

– రవీందర్, హెచ్‌ఎంఎస్ యూనియన్ ట్రెజరర్

మన్ కీ బాత్ @ 100


వివేకానందనగర్‌లో మన్ కీ బాత్‌ను బీజేపీ కార్యకర్తలతో కలిసి వీక్షిస్తున్న మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: ప్రధాన మంత్రి నరేంద్రమోదీ మన్ కీ బాత్ కార్యక్రమం ద్వారా దేశ ప్రజలకు విలువైన సందేశాన్నిస్తున్నారని.. ఈ కార్యక్రమాన్ని ప్రజలు వినాలని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నేత కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. ఆదివారం వివేకానందనగర్‌లో శక్తి కేంద్ర ఇన్‌చార్జ్ బిల్లా వెంకటేష్ ఆధ్వర్యంలో శ్రీశైలం గౌడ్ బీజేపీ కార్యకర్తలతో కలిసి 100వ ×మన్ కీ బాత్×కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సత్యం, పుండరీకం, సంతోష్, గుండప్ప, మాడప్ప, నాగేందర్, రాజు, చెన్నమ్మ, నాగమణి, అనిత బూత్ అధ్యక్షులు, బూత్ కమిటీల సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

◆ కుత్బుల్లాపూర్ డివిజన్ వాజ్‌పేయినగర్‌లో శక్తి కేంద్ర ఇన్‌చార్జ్, జిల్లా గిరిజన మోర్చ అధ్యక్షుడు కట్టాకుమార్ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులతో కలిసి మన్ కీ బాత్ కార్యక్రమాన్ని టీవీలో వీక్షించారు. ఈ కార్యక్రమంలో బూత్ అధ్యక్షులు సాయి, చింటు, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

◆ గాజులరామారం డివిజన్ బాలాజీ లేఔట్‌లో బీజేపీ నేత, కేకేఎం ట్రస్ట్ చైర్మన్ కూన శ్రీనివాస్‌గౌడ్ బూత్ కమిటీ సభ్యులతో కలిసి విన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకుడు పురుషోత్తం, 227, 229 బూత్ ల అధ్యక్షులు, బూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

◆ **సుభాష్‌నగర్:** మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని ఆదివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని ఆయా శక్తి కేంద్రాల్లో బీజేపీ నాయకులు, కార్యకర్తలు వీక్షించారు. దూలపల్లిలో రాష్ట్ర బీజేపీ మాజీ ఉపాధ్యక్షుడు మల్లారెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు ప్రధాని సందేశాన్ని విన్నారు.

కుత్బుల్లాపూర్–గాజులరామారం జంట సర్కిళ్లు..

ఎర్లీబర్డ్‌లో రికార్డు


రాయితీకి చివరి రోజు కావడంతో ఆదివారం ఇంటి పన్నులు చెల్లించేందుకు వచ్చిన గృహ యజమానులు

కుత్బుల్లాపూర్: ముందస్తు చెల్లింపు రాయితీ (ఎర్లీ బర్డ్) పథకం ద్వారా 2023–24 ఆర్థిక సంవత్సరం కుత్బుల్లాపూర్– గాజులరామారం జంట సర్కిళ్లు రికార్డు సృష్టించాయి. ఐదు శాతం రాయితీతో చెల్లించడానికి ఆదివారంతో గడువు ముగిసింది. ఈ నేపథ్యంలో చివరి రోజు పోటాపోటీగా ప్రజలు ఎర్లీ బర్డ్ పథకం ద్వారా పనులు చెల్లించేందుకు ముందుకు రావడంతో అనుకున్న టార్గెట్ పూర్తయింది... గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని అన్ని సర్కిల్లో ఎర్లీ బర్డ్ పథకం ద్వారా పన్నుల వసూళ్లకు శ్రీకారం చుట్టగా కూకట్‌పల్లి జోన్ పరిధిలోని రెండు సర్కిల్ కుత్బుల్లాపూర్ రూ.16.50 కోట్లు, గాజులరామారం రూ.11.32 కోట్లు టార్గెట్ విధించారు.

అనుకున్న దానికంటే అధికంగా...

◆ గ్రేటర్ అధికారుల సూచన మేరకు జంట సర్కిల్లో కమిషనర్లు మంగతాయారు, ప్రశాంతి గత నెల రోజులుగా ఎర్లీ బర్డ్ ముఖ్య ఉద్దేశాన్ని ప్రజలకు చేరవేస్తూ బిల్ కలెక్టర్లు రెవిన్యూ అధికారులతో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి ఇంటింటి ప్రచారం చేయడంతో వారు అనుకున్న టార్గెట్ పూర్తి అయ్యిందనే చెప్పుకోవచ్చు.. కుత్బుల్లాపూర్‌లో రూ.50 లక్షల పైగానే అదనంగా రాగా గాజులరామారంలో రూ.70 లక్షలు అదనంగా రావడం విశేషం. ఉదయం నుంచి ప్రజలు పెద్ద ఎత్తున కార్యాలయానికి రావడంతో ప్రత్యేకంగా కౌంటర్లు ఏర్పాటు చేసి వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టారు. మధ్యాహ్నం వరకే గ్రేటర్ అధికారులు ఇచ్చిన టార్గెట్ పూర్తి కావడంతో అధికారుల సంతోషం వ్యక్తం చేశారు.

వ్యభిచార గృహంపై దాడి

జీడిమెట్ల: ఓ వ్యభిచార గృహంపై జీడిమెట్ల పోలీసలు దాడి చేసి ఇద్దరు నిర్వహకులతో పాటు ఓ మహిళ, ఓ యువకుడిని అరెస్టు చేశారు. సీఐ యం .పవన్ వివరాల ప్రకారం.. ఆదివారం గాజులరామారంలోని ఓ ఇంట్లో వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని కన్నెపల్లి శోభ(47), మందుల లత(35) అనే ఇద్దరు నిర్వాహకులతో పాటు ఓ మహిళ(23), గుండ్లపోచంపల్లికి చెందిన సందీప్ కుమార్ జేనా(27)లను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. మహిళను రెస్క్యూహోంకు తరలించారు.

అక్రమ సంబంధాన్ని బయటపెట్టినందుకు..

భార్య బంధువులపై కత్తితో దాడి

జీడిమెట్ల: వేరే మహిళతో అక్రమ సంబంధాన్ని బయటపెట్టిన భార్య బంధువులపై భర్త కత్తితో దాడి చేసి గాయపరిచిన ఘటన జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ పవన్ తెలిపిన వివరాల ప్రకారం.. గాజులరామారం వల్లభాయ్‌నగర్‌కు చెందిన విజయ్‌కుమార్‌కు మెదక్ జిల్లా చేగుంట మండలం నార్సింగి గ్రామానికి చెందిన స్వప్నతో 16 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ముగ్గురు పిల్లలున్నారు. కాగా విజయ్‌కుమార్ మూడేళ్లుగా మరో మహిళతో అక్రమ సంబంధం కొనసాగిస్తూ వస్తున్నాడు. అప్పటి నుంచి భార్యను సైతం దూరం పెడుతూ విడాకులు ఇవ్వాల్సిందిగా వేధిస్తూ వస్తున్నాడు. కొన్ని నెలలుగా ఇంటి రావడంలేదు, కుటుంబ సభ్యులు ఫోన్లు చేసినా స్పందించడం లేదు.

◆ శనివారం రాత్రి సదరు మహిళతో విజయ్‌కుమార్ ఉన్నట్లు తెలుసుకున్న స్వప్న, ఆమె అక్కలు శ్యామల, మంజుల, బాబాయి శ్రీనివాస్ అక్కడికి వెళ్లారు. అతడిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని నిలదీయగా వారి మధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలో భార్య స్వప్నను కొడుతున్న విజయ్‌కుమార్‌ను అడ్డుకున్న శ్రీనివాస్‌పై కత్తితో దాడి చేయగా అతని మెడభాగం, చేతిపై తీవ్ర గాయాలయ్యాయి. దీంతో క్షతగాత్రుడిని సమీపంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. ఆదివారం బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి అదృశ్యం

జగద్గిరిగుట్ట: అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జగద్గిరిగుట్ట మైసమ్మనగర్‌కు చెందిన బద్దం వెంకటరెడ్డి(45), మంజుల భార్యాభర్తలు. కాగా మే 17న ఉదయం 8 గంటలకు భార్యను డ్యూటీ నిమిత్తం జగద్గిరిగుట్ట బస్టాప్‌లో బైక్‌పై దించిన వెంటకరెడ్డి 8.30 గంటలకు డ్యూటీకి వెళ్తున్నానని తన కుమారుడికి చెప్పి వెళ్లాడు. అయితే అదే రోజు రాత్రి 8 గంటలకు డ్యూటీ ముగించుకుని ఇంటికి వచ్చిన మంజుల కు భర్త టిఫిన్ బాక్స్, మొబైల్ ఫోన్‌లు ఇంటి వద్దనే ఉంచాడని గమనించి అతని కోసం కంపెనీకి కాల్ చేస్తే డ్యూటీకి రాలేదని చెప్పారు. దీంతో అప్పటి నుంచి కుటుంబ సభ్యులు వెంకటరెడ్డి ఆచూకీ కోసం ఎంత వెతికినా లభించలేదు. దీంతో ఆదివారం జగద్గిరిగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తికి అండగా..

నిజాంపేట్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తికి నిజాంపేట్ కార్పొరేషన్‌కు చెందిన బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర నాయకుడు, కారుణ్య వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపకుడు దాసి నాగరాజు అండగా నిలిచారు. బాచుపల్లిలో తాత్కాలిక నివాసం ఏర్పాటు చేసుకుని కూలి పనులు చేసే వెంకటేష్ ఈనెల 28న మణికొండలోని పనులు ముగించుకుని నడచుకుంటూ వెళ్తుండగా వేగంగా వచ్చిన కారు ఢీకొట్టింది. అతని ఎడమ కాలిపాదానికి తీవ్ర గాయమైంది. దీంతో అతనికి రూ.10వేలు వెచ్చించి ప్రాథమిక చికిత్స అందించారు. సమాచారం అందుకున్న దాసి నాగరాజు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి కారణమైన గుడిమల్కాపూర్‌కు చెందిన మహ్మద్ హర్షద్‌తో మాట్లాడి రూ.60 వేలు వైద్య ఖర్చుల నిమిత్తం ఇచ్చేలా ఒప్పించి సదరు మొత్తాన్ని ఆదివారం బాధితుడు వెంకటేష్‌కు అందజేశారు. దీంతో బాధితుడి కుటుంబ సభ్యులు, ఇతర కూలీలు హర్షం వ్యక్తం చేశారు.

సీఎంను కలిసిన జెడ్‌సీ



రాష్ట్ర సచివాలయ భవన ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర టీజీవో అధ్యక్షురాలు, కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ మమత ఆదివారం సీఎం చంద్రశేఖర్‌రావును కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. – కుత్బుల్లాపూర్

జీఓ.58, 59 దరఖాస్తులకు పెరిగిన తాకిడి

సుభాష్‌నగర్: ప్రభుత్వ స్థలాల క్రమబద్ధీకరణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 58, 59 జీవోల ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ ఆదివారం చిట్టచివరి కావడంతో దరఖాస్తుదారులు తాకిడి పెరిగింది. స్థానికంగా మీ సేవలలో ఉదయం నుండి సాయంత్రం వరకు 58, 59 జీవోల కింద దరఖాస్తు చేసుకున్నారు. దీంతో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని మీ సేవ సెంటర్లు దరఖాస్తుదారులతో కిక్కిరిసిపోయాయి.

